సాక్షి కామారెడ్డి


బుధవారం । 19 । మార్చి । 2025



ట్రాఫిక్ నియమాలు పాటించాలి

ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎస్పీ రాజేశ్‌చంద్ర సూచించారు. కమాండ్ కంట్రోల్ రూమును పరిశీలించారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
38.5 /18.7

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే తోట



నిజాంసాగర్(జుక్కల్): ఎస్సీ వర్గీకరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలపడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుతోపాటు పలువురు ఎమ్మెల్యేలు మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తదితరులున్నారు.

పక్కా ప్రణాళికతో చదవాలి



గాంధారి/నస్రుల్లాబాద్ : పదో తరగతి విద్యార్థులు పక్కా ప్రణాళికతో చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో రాజు అన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి తాము చదివిన పాఠశాలకు, పాఠాలు బోధించిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. గాంధారి, నస్రుల్లాబాద్ మండలాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. గాంధారి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 111 మంది పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక ఉపాధ్యాయుడు పెంటయ్య సమకూర్చిన పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను అందజేశారు. అలాగే నస్రుల్లాబాద్ మండలంలోని నెమ్లి జెడ్పీహెచ్‌ఎస్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఆయనవెంట ఎంఈవోలు శ్రీహరి, చందర్, గాంధారి హెచ్‌ఎం వెంకటేశ్వర్లుగౌడ్, నస్రుల్లాబాద్ మండల పీఆర్టీయూ అధ్యక్షుడు హన్మాండ్లు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష జరిగింది. మొత్తం 38 కేంద్రాలలో 8423 మంది విద్యార్థులకు గాను 8243 మంది హాజరుకాగా, 180 మంది గైర్హాజరయ్యారు. ఇందులో 7140 మంది జనరల్ విద్యార్థుకు గాను 6999 మంది హాజరు కాగా, 141 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ కోర్సుల్లో 1283 మందికి గాను 1244 హాజరుతో 39 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలను జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం పర్యవేక్షించారు.

సదాశివనగర్ మండలం లింగంపల్లి వద్ద చేపట్టిన తవ్వకం పనులు



గోదారమ్మ వచ్చేనా..

కాళేశ్వరం 22వ ప్యాకేజీకి రూ. 2,100 కోట్లు అవసరం

- నిధులు కేటాయిస్తేనే నీళ్లు పరవళ్లు తొక్కేది!
- ఏళ్లుగా ముందుకు కదలని పనులు
- ఈ బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తారా..

కాళేశ్వరం 22వ ప్యాకేజీ.. ఏళ్లు గడుస్తున్నా ముందుకు కదిలింది లేదు. రైతుల సాగునీటి గోసను పరిష్కరించే పనులను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నామని ఎన్నికల సమయంలో ప్రకటిస్తున్న నాయకులు తరువాత ఆ ఊసే ఎత్తడం లేదు. ఫలితంగా తమ భూముల్లోకి గోదారమ్మ ఎప్పుడొచ్చేదని రైతులు వాపోతున్నారు. పనులు పూర్తి చేసేందుకు రూ.2,100 కోట్లు అవసరం కాగా.. అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై ఆశలు పెరిగాయి.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : మెట్ట ప్రాంతానికి గోదారమ్మను మళ్లించి రైతుల కష్టాలను తీర్చేందుకు రూపొందించిన కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులకు నిధుల గ్రహణం పట్టింది. ప్రభుత్వాలు మారుతున్నా ఈ ప్యాకేజీకి సంబంధించిన పనులపై రివ్యూలు జరగకపోగా, నిధులూ ఇవ్వడం లేదు. దీంతో ఏళ్లు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో 22వ ప్యాకేజీకి ఏమైనా నిధులు ఇస్తారేమోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలోని ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజవర్గాల్లో బోర్లు తవ్వించి అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలను దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన ప్రజాప్రస్థానం పాదయాత్రలో భాగంగా పరామర్శించారు. తాము అధికారంలోకి రాగానే గోదావరి జలాలతో సాగునీటి కష్టాలను తీరుస్తామని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజక వర్గాలతోపాటు పొరుగున ఉన్న మెదక్ జిల్లాలోని రామాయంపేట ప్రాంతానికి సాగునీటిని అందించేందుకు ప్రాణహిత–చేవెళ్ల పథకంలో 22వ ప్యాకేజీని రూపొందించారు. పనులకు కామారెడ్డి పట్టణం నడిబొడ్డున శంకుస్థాపన చేశారు. నిధులు మంజూరు కావడంతో పనులు మొదలయ్యాయి. భూంపల్లి రిజర్వాయర్ పనులు చేపట్టి కాలువలూ తవ్వారు. సొరంగం పనులు చేపట్టారు. అయితే వైఎస్సార్ మరణానంతరం నిధుల సమస్య వచ్చిపడింది.

పేరుమార్పు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రాణహిత–చేవెళ్లను కాళేశ్వరం ప్రాజెక్టుగా పేరు మార్చినా 22వ ప్యాకేజీని అలాగే కొనసాగించారు. అయితే నిధులు విడుదల కాకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. ప్యాకేజీలో కీలకమైన భూంపల్లి రిజర్వాయర్ పనులు చేపట్టారు. అక్కడి నుంచి నీటిని గ్రావిటీ ద్వారా మూడు ప్రాంతాలకు తరలించేందుకు లెఫ్ట్, రైట్, రిడ్జ్ కెనాల్స్ పనులు చేపట్టారు. అయితే కామారెడ్డి, భిక్కనూరు, లింగంపేట, రాజంపేట, గాంధారి మండలాల్లో రిజర్వాయర్ల నిర్మాణానికి అవసరమైన 3 వేల ఎకరాల భూసేకరణ ఇప్పటికీ పూర్తి కాలేదు. భూసేకరణ జరిగితే ఐదు రిజర్వాయర్ల నిర్మాణం పనులు మొదలుపెట్టొచ్చు.

ప్రాజెక్టు పూర్తి చేయాలంటే రూ.2,100 కోట్లు అవసరం అవుతాయని నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. పనులు మొదలుపెట్టి రెండు దశాబ్దాలు కావొస్తున్నా పూర్తి కావడం లేదు. 22వ ప్యాకేజీ పూర్తి చేస్తే ఎల్లారెడ్డి నియోజక వర్గంలోని గాంధారి, లింగంపేట, తాడ్వాయి, సదాశివనగర్, రామారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గంలోని కామారెడ్డి, మాచారెడ్డి, పాల్వంచ, దోమకొండ, బీబీపేట, భిక్కనూరు, రాజంపేట మండలాలతోపాటు మెదక్ జిల్లాలోని రామాయంపేట, నిజాంపేట తదితర మండలాలకు ప్రయోజనం చేకూరుతుంది. ఏళ్లు గడుస్తున్నా పనులు ముందుకు కదలకపోవడానికి ప్రధాన కారణం నిధులు కేటాయించకపోవడమే.

వాగ్దానానికే పరిమితం

ప్రతిసారి ఎన్నికల్లో 22వ ప్యాకేజీ అంశం వాగ్దానంగా మారుతోంది తప్ప పనులు ముందుకు కదలడం లేదు. సాగునీటి కోసం రైతులు దశాబ్దాలు పడుతున్న కష్టాలకు 22వ ప్యాకేజీ ఒక్కటే పరిష్కారమని పదే పదే చెప్పే రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు నిధుల కోసం గట్టిగా ప్రయత్నించడం లేదు. ఏటా భూగర్భజలాలు అడుగంటిపోయి చేతికందే సమయంలో పంటలు ఎండిపోతుండడం, రైతులు అప్పులపాలవుతున్న విషయం తెలిసి కూడా నిధులు సాధించేందుకు చొరవ చూపడం లేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఉన్నత స్థాయిలో సమీక్షలు జరిపి, అవసరమైన నిధులు సాధించేందుకు రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు ఒక్కటి కావాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

భట్టి బడ్జెట్‌పై ఆశలు

రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను బుధవారం శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రూ.2,100 కోట్లు కేటాయిస్తే 22వ ప్యాకేజీ పనులు ముందుకు కదులుతాయి. నిధులు మంజూరు చేస్తేనే బీడు భూముల్లో గోదారమ్మ పరవళ్లు తొక్కుతుందని, అప్పటి దాకా తమ కష్టాలు తీరేట్టు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టు పనుల పూర్తికి నిధులు కేటాయించి సాగునీటి కష్టాల నుంచి గట్టెక్కించాలని కోరుతున్నారు. అలాగే జుక్కల్ నియోజక వర్గ రైతులకు ఉపయోగపడే అంతర్‌రాష్ట్ర ప్రాజెక్టు అయిన లెండితోపాటు నాగమడుగు ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

బారికేడ్లు తోసుకుని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న అంగన్‌వాడీలు



అంగన్‌వాడీల నిర్వీర్యానికి కుట్ర

- రెండో రోజూ కొనసాగిన అంగన్‌వాడీల ధర్నా
- బారికేడ్లను తోసుకుని కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నం
- అడ్డుకున్న పోలీసులు



అడిషనల్ కలెక్టర్ విక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు, నాయకులు

కామారెడ్డి టౌన్ : బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కందూరి చంద్రశేఖర్ ఆరోపించారు. తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో 48 గంటల పాటు చేపట్టిన మహాధర్నాలో భాగంగా మంగళవారం కలెక్టరేట్‌ను అంగన్‌వాడీలు ముట్టడించారు. కలెక్టరేట్ ఎదుట గంటన్నరపాటు బైఠాయించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు వేధింపులు మానుకోవాలని, సెంటర్లకు ఎండకాలం సెలవులు ప్రకటించాలన్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తల 23 డిమాండ్‌లను వెంటనే పరిష్కరించని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ధర్నా అనంతరం బారికేడ్లను తోసుకుని కలెక్టర్ కార్యాలయంలోకి వెళ్లేందుకు అంగన్‌వాడీ టీచర్లు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కొద్దిసేపు తోపులాట చోటుచేసుకుంది. అనంతరం అడిషనల్ కలెక్టర్ విక్టర్, ఐసీడీఎస్ పీడీ ప్రమీల వారి వద్దకు రాగా వినతిపత్రాలు అందజేశారు. నాయకులు కొత్త నర్సింలు, మోతీరాం నాయక్, వెంకట్‌గౌడ్, రాజనర్సు, అరుణ్, అజయ్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు కల్పన, బాబాయ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లే అవుట్‌ల నివేదికలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: లే అవుట్‌లు, ప్లాట్ల అనుమతులకు సంబంధించిన నివేదికలను పూర్తి వివరాలతో అందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం తెలంగాణ బి–పాస్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో లే అవుట్‌లు, ప్లాట్లను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి నివేదికలు అందజేయాలన్నారు. రెవెన్యూ, విద్యుత్, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్, నీటిపారుదల, మున్సిపల్, టౌన్ ప్లానింగ్ తదితర శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలన చేపట్టాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్‌ఈ శ్రావణ్ కుమార్, పంచాయతీ రాజ్ ఈఈ దుర్గా ప్రసాద్, రోడ్లు భవనాల శాఖ ఈఈ రవి శంకర్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, డీటీసీపీవో సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

ప్రభుత్వ మెడికల్ కళాశాలకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. తన చాంబర్‌లో మిషన్ భగీరథ, మెడికల్ కళాశాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టల్‌లలో నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు.

తహసీల్దార్‌ల బదిలీల్లో మార్పులు

కామారెడ్డి క్రైం: జిల్లాలో 15 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ కాగా, ఆ జాబితాలో మార్పులు చేస్తూ మంగళవారం మరో సారి ఉత్తర్వులు వెలువడ్డాయి. గంటల వ్యవధిలోనే తహసీల్దార్‌ల బదిలీలకు సంబంధించిన ఉత్తర్వుల్లో మార్పులు చోటు చేసుకోవడం చర్చనీయంశంగా మారింది. బిచ్కుంద తహసీల్దార్ యూ సురేశ్‌ను లింగంపేటకు, డోంగ్లీ తహసీల్దార్ రేణుకాచౌహాన్‌ను గాంధారికి, హిమబిందును జుక్కల్ నుంచి పాల్వంచకు, వేణుగోపాల్‌ను పిట్లం నుంచి బిచ్కుందకు, మహేందర్‌ను ఎల్లారెడ్డి నుంచి జుక్కల్‌కు, రాజనరేందర్‌గౌడ్‌ను లింగంపేట నుంచి పిట్లంకు, సతీశ్‌రెడ్డిని గాంధారి నుంచి రాజంపేటకు, అనిల్‌కుమార్‌ను రాజంపేట నుంచి డోంగ్లీకి, సువర్ణను రామారెడ్డి నుంచి బాన్సువాడ సబ్‌కలెక్టర్ కార్యాలయానికి, జయంత్‌రెడ్డిని పాల్వంచ నుంచి కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. విజయ్‌కుమార్‌ను బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో నుంచి కలెక్టరేట్‌కు బదిలీ చేసి ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయానికి డిప్యుటేషన్‌పై పంపించారు. ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్న తహసీల్దార్ ప్రేమ్‌కుమార్‌ను ఎల్లారెడ్డికి, కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉమాలతను రామారెడ్డికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వివాదాలకు కేరాఫ్‌గా మారుతున్న అధికారులు

- అధికారుల నిర్లక్ష్యంపై నిప్పులు చెరుగుతున్న బీజేపీ నేతలు
- ఆర్‌టీఐ దరఖాస్తులను పట్టించుకోవడంలేదంటూ అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే కేవీఆర్
- పసుపు బోర్డు ప్రారంభ సమావేశానికి సహకరించని జిల్లా కలెక్టర్
- కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయనీయలేదు : బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఉమ్మడి జిల్లాలో బీజేపీ నాయకులు అధికారుల వ్యవహార శైలిపై బహిరంగంగా నిప్పులు చెరుగుతున్నారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా.. సుదీర్ఘకాలం సర్వీసులో ఉండే బ్యూరోక్రాట్లు, అధికారులు, ఉద్యోగులు ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ నిష్పక్షపాతంగా పనిచేయాల్సి ఉండగా, తరచూ వివాదాస్పదమవుతున్నారు. ఈ పరిస్థితులు సాధారణ ప్రజల్లో చర్చనీయాంశమవుతున్నాయి. ఉన్నతాధికారులు, ఉద్యోగులు ఇలా వివాదాలకు కేరాఫ్‌గా మారుతుండడంపై విమర్శలు వస్తున్నాయి.

✤ కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి శాసనసభలోనే ప్రభుత్వం, ప్రభుత్వ అధికారుల తీరుపై ని ప్పులు చెరిగారు. కామారెడ్డిలో విద్య, వైద్య శాఖల్లో వివిధ అంశాలకు సంబంధించి సమాచార హక్కు చట్టం కింద 86 దరఖాస్తులు ఇస్తే ఏమాత్రం సమాధానాలు ఇవ్వలేదన్నారు. పైగా తానే స్వయంగా దరఖాస్తు ఇవ్వడానికి వెళి తే ఇలాంటివి చాలా చూశాం.. అ య్యేవా.. పోయేవా అంటూ ఉద్యోగులు, అధికారులు మాట్లాడారన్నారు. అధికారులకు ఇది మంచి పద్ధతి కాదని, సదరు అధికారుల పేర్లు సైతం చెప్పగలుగుతానన్నారు. సమాచారం ఇచ్చేది లేదని అధికారులే అంటే ఎలా అన్నారు. ప్రతీది ఫైల్‌తో సహా తనవద్ద ఉందన్నారు. అధికారులు గౌరవంగా వ్యవహరిస్తే బాగుంటుందన్నారు. ఈ ప్రవర్తన అందరికీ సిగ్గుచేటన్నారు. పద్ధతి మార్చుకోకుండా రాబోయే కాలంలో తన పద్ధతి మార్చుకునేలా చేస్తారా అని అసెంబ్లీలో నిప్పులు చెరిగారు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలో ఓడినవారు, నియోజకవర్గం నుంచి పారిపోయిన వారి పేరిట ప్రతిపాదనలు ఇవ్వడమేమిటి.. ఇన్‌చార్జి మంత్రి మంజూరు చేయడమేమిటన్నారు. ఇలా అయితే ప్రజల ద్వారా ఎన్నికైన తానేం చేయాలంటూ పరోక్షంగా షబ్బీర్ అలీపై కేవీఆర్ విమర్శలు ఎక్కుపెట్టారు.

✤ తాజాగా నిజామాబాద్‌లో కేంద్ర వాణిజ్య పన్నుల శాఖ పరిధిలోని పసుపు బోర్డు సమావేశంలో పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి నేరుగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుపైనే విమర్శలు సంధించారు. జనవరిలో పసుపు బోర్డు తాత్కాలిక కార్యాలయాన్ని వర్చువల్ విధానంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించేందుకు కలెక్టర్‌ను సంప్రదించగా.. పండుగ సమయంలో ఎవరూ అందుబాటులో ఉండరంటూ కార్యక్రమ నిర్వహణకు తిరస్కరించారని గంగారెడ్డి అధికారిక సమావేశంలోనే తెలిపారు. కొన్ని అపోహలు తొలగించేందుకు ఈ విషయాన్ని జిల్లా ప్రజలకు తెలపాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. దీనిపై రైతులు, ఉన్నతాధికారుల్లో చర్చ జరిగింది. మంగళవారం పసుపు బోర్డు ఆధ్వర్యంలో సీనియర్ ఐఏఎస్‌లు, జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొన్న సమావేశం గురించి సైతం జిల్లా పౌరసంబంధాల అధికారికి తెలియకపోవడం గమనార్హం.

✤ జక్రాన్‌పల్లి మండలం లక్ష్మాపూర్‌లో ప్రభుత్వ భూమిలో అక్రమంగా స్టోన్ క్రషర్ నిర్వహించడంపై కేఆర్ సుదర్శన్‌రెడ్డి అనే వ్యక్తి సమాచార హక్కు చట్టం ద్వారా పూర్తి వివరాలు తీసుకుని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమ క్రషర్ నిర్వాహకుడికి అనేకసార్లు నోటీసులు ఇచ్చారు. చర్యలు తీసుకోలేదని అడిగితే ఆ విషయమే తమకు తెలియదని కలెక్టర్, అదనపు కలెక్టర్ చెబుతున్నారని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. దీనిపై సీఎంకు ఫిర్యాదు చేయనున్నట్లు సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.

నిలువ నీడ లేదు!

బస్సు కోసం భానుడి భగభగలను భరించాల్సిందే..

- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- బస్టాపుల్లో కనిపించని షెడ్డులు
- ఎండలోనే ప్రయాణికుల నిరీక్షణ



జిల్లా కేంద్రంలోని ఇందిరాచౌక్ బస్టాప్‌లో ఎండలో నిల్చున్న ప్రయాణికులు

కామారెడ్డి టౌన్ : బస్సుల కోసం ఎదురు చూసే ప్రయాణికులు భానుడి భగభగలను భరించాల్సిందే. జిల్లా కేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లోని బస్టాపుల్లో ప్రయాణికులు నిల్చునేందుకు షెడ్డులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజురోజుకు పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా, బస్టాపులు, ప్రధాన చౌరస్తాల్లో కనీసం నీడ సౌకర్యం, కూర్చునేందుకు కుర్చీలు లేకపోవడంతో రోడ్లపై ఎండలోనే నిరీక్షిస్తున్నారు. ఎండాకాలంలో ఆర్టీసీ అధికారులు బస్టాప్‌లలో నీడ సౌకర్యం కల్పించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు.

కామారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్‌తో పాటు, రైల్వే స్టేషన్ ముందు అడ్లూర్ రోడ్ మార్గంలో పాత బస్టాండ్, ఇందిరా చౌక్‌లో మరో బస్టాప్ ఉంది. అలాగే నిజాంసాగర్ చౌరస్తాలో, నిజాంసాగర్ రోడ్‌లో, రామారెడ్డి చౌరస్తాలో ఆర్టీసీ బస్టాప్‌లు ఉ న్నాయి. నిజామాబాద్ వైపు వేళ్లే వారు కొత్త బస్టాండ్‌కు వెళ్లి బస్సులు ఎక్కుతారు. ఎల్లారెడ్డి రూట్ వైపు వెళ్లే వారి కోసం నిజాంసాగర్ రోడ్‌లో, హైదరాబాద్ రూట్ వైపు వెళ్లే వారు నిజాంసాగర్ చౌరస్తాలో, క రీంనగర్ వైపు వేళ్లే వారు ఇందిరాచౌక్‌లో, రామారెడ్డి వైపు వేళ్లే వారి కోసం రామారెడ్డి చౌరస్తాలో బస్టాప్‌లు ఉన్నాయి. అయితే ఏ ఒక్క బస్టాప్ వద్ద కూడా షెడ్లు, కూర్చునేందుకు కుర్చీలు, బెంచీలు లేవు. ఆర్టీసీ, మున్సిపల్ అధికారులు స్పందించి ఎండాకాలం పూర్తయ్యే వరకు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.



కామారెడ్డిలోని నిజాంసాగర్ చౌరస్తాలో..

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి రూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రయాణికులు బస్సు కోసం ఎండలో పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఉంది. పట్టణం నుంచి ప్రతిరోజూ కామారెడ్డి, మెదక్ వైపు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళ్లలో సమస్య లేకున్నప్పటికీ, మధ్యాహ్నం వేళ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో..

షెడ్లు ఏర్పాటు చేయాలి



కామారెడ్డిలోని బస్టాప్‌లలో ఎక్కడా షెడ్లు లేవు. బస్సు వచ్చే వరకు ఎండలో నిల్చోవాల్సి వస్తుంది. అధికారులు ఎండాకాలంలో కనీసం తాత్కాలికంగా నీడ కోసం షెడ్లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– పి. రాజు, కామారెడ్డి

ఎండలోనే నిల్చోవాల్సి వస్తుంది



జిల్లా కేంద్రంలోని బస్టాప్‌ల వద్ద ప్రయాణికులు ఎండలో నిల్చుంటున్నారు. సిరిసిల్ల వెళ్లేందుకు నేను అరగంట పాటు ఇందిరాచౌక్‌లో ఎర్రటి ఎండలో బస్సు వచ్చేంత వరకు నిల్చున్నా. కనీసం కూర్చోడానికి కుర్చీలు లేవు.

– మల్లేశ్, ప్రయాణికుడు, కామారెడ్డి

ఏర్పాట్లు చేస్తాం

ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో బస్టాప్‌ల వద్ద తాత్కాలిక షెడ్ల ఏర్పాటు కోసం కృషి చేస్తాం. ఉన్నతాధికారులకు నివేదిస్తా. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతాం. మున్సిపల్ అధికారులను సంప్రదిస్తాం.

– ఇందిరా, ఆర్టీసీ డిపో మేనేజర్, కామారెడ్డి

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

- అతిక్రమిస్తే చర్యలు తప్పవు
- ఎస్పీ రాజేష్ చంద్ర



కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న ఎస్పీ

కామారెడ్డి క్రైం: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న కమాండ్ కంట్రోల్ రూం ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీటు బెల్టులను ధరించాలన్నారు. అతివేగం మంచిదికాదన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని జాతీయ రహదారి ఎన్‌హెచ్ 44 వెంబడి(భిక్కనూరు నుంచి దగ్గి అటవీ ప్రాంతం వరకు) వాహనాల వేగాన్ని గంటకు 80 కిలో మీటర్లకు కుదించడం జరిగిందన్నారు. అంతకుమించి ఎవరైనా వాహనాలు వేగంగా నడిపితే జరిమానాలు విధించడం జరుగుతుందని తెలిపారు.

ధర్నా చౌక్ పరిశీలన

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ పరిసరాలను ఎస్పీ రాజేశ్‌చంద్ర పరిశీలించారు. ధర్నా చౌక్, కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద పోలీస్ బందోబస్తు తదితర అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్‌ఐ రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



కామారెడ్డిలో కాంగ్రెస్ కార్యాలయం ముందు సంబురాలు చేసుకుంటున్న నాయకులు



బాన్సువాడలో రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

- బీసీ రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించినందుకు..

కామారెడ్డి టౌన్/బాన్సువాడ : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం ముందు నాయకులు సంబురాలు జరుపుకున్నారు. బాన్సువాడలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేసి టపాసులు పేల్చారు. ఈ సందర్భంగా కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన బిల్లును అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించినందుకు ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సీఎం, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనె శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు చాట్ల రాజేశ్వర్, షేరు, కన్నయ్య, ఓబీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు సంపంగి, శంకర్, సాప శివరాములు, మల్లయ్య, రాజేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలతోనే అభివృద్ధి సాధ్యం

- ప్రజలకు అవగాహన కల్పించాలి
- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న యెండల లక్ష్మీనారాయణ

కామారెడ్డి టౌన్: జమిలి ఎన్నికలతోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ అన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక (జమిలి ఎన్నిక)లపై కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రతిపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు అధ్యక్షతన ఒకే దేశం ఒకే ఎన్నిక బీజేపీ దృక్కోణం అంశంపై నిర్వహించిన వర్క్ షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశంలో ప్రతి సంవత్సరం ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతుండటంతో అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని ఆరోపించారు. ఆర్థికంగా తీవ్ర భారం తగ్గుతుందన్నారు. దేశంలో జమిలి ఎన్నికల కోసం ప్రజలకు అవగాహన కల్పించాలని ఇందుకోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల స్థాయిలో వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు మురళీధర్ గౌడ్, రంజిత్ మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శులు నరేందర్ రెడ్డి, రవీందర్ రావు, నాయకులు లింగ రావు, వేణు, శ్రీనివాస్, లక్ష్మి నారాయణ, భరత్, నరేందర్, రమేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాలువ వద్ద హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు



బాన్సువాడ రూరల్ : నిజాంసాగర్ ప్రధాన కాలువ ద్వారా నీటిని వదిలిన ప్రతిసారి ఎక్కడో ఓ చోట నీటి ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. ఇటీవల సంగ్రాం తండాకు చెందిన సిద్దార్థ అనే యువకుడు నీటిప్రవాహంలో కొట్టుకుపోయి తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిల్చాడు. వరుస ప్రమాదాలతో స్పందించిన నీటిపారుదల శాఖ అధికారులు నిజాంసాగర్ ప్రధాన కాలువ కట్టపై ప్రమాదం పొంచి ఉందంటూ హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

అంకిత భావంతో పనిచేయాలి



కామారెడ్డి క్రైం: అంకిత భావంతో పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కాంట్రాక్టు ప్రాతిపదికన ఎంపికైన స్టాఫ్ నర్సులు, వాక్సిన్ కోల్డ్ చైన్ మేనేజర్ లకు మంగళవారం తన చాంబర్ లో నియామక పత్రాలను కలెక్టర్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగంలోకి వచ్చిన వారు అంకిత భావంతో పనిచేయాలన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద కాంట్రాక్ట్ ప్రాతిపదికన 26 మందికి , వాక్సిన్ కోల్డ్ చైన్ మేనేజర్ గా ఒకరికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, సబ్ యూనిట్ అధికారి చలపతి తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

భిక్కనూరు: విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో ఉంటే వారి భవిష్యత్తు బంగారుమయంగా ఉంటుందని జిల్లా గ్రంథాలయ సంస్థచైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంఈవో రాజ్‌గంగారెడ్డి, నోడల్ అధికారి శ్రీనాథ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భీంరెడ్డి,నేతలు బల్యాల సుదర్శన్, సుధాకర్‌రెడ్డి, లింబాద్రి, దయాకర్‌రెడ్డి, శ్రీరామ్ వెంకటేష్, అంకం రాజు,నర్సింహారెడ్డి, మైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోతున్నా పట్టించుకోరా?

- పంచాయతీ కార్యదర్శిపై సబ్ కలెక్టర్ ఆగ్రహం



పల్లె ప్రకృతి వనంలో పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): పల్లె ప్రకృతి వనంలో మొక్కలు ఎండిపోతున్నా పట్టించుకోరా..? అంటూ నాచుపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వినయ్‌పై సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని నెమ్లి, నాచుపల్లి గ్రామాలను సబ్ కలెక్టర్ మంగళవారం సందర్శించారు. నెమ్లి గ్రామంలోని వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించిన ఆమె రిజిస్టర్‌లో సీఎల్ వేసి ఉండడాన్ని గమనించి సిబ్బంది విధుల్లోకి వస్తున్నారో లేదో పరిశీలించాలని తహసీల్దార్ ప్రవీణ్‌ను ఆదేశించారు. అనంతరం నాచుపల్లి గ్రామంలోని నర్సరీ, పల్లె ప్రకృతి వనం, గిరిజన మినీ గురుకుల బాలికల పాఠశాలను పరిశీలించారు. పల్లె ప్రకృతి వనంలో ప్రతి మొక్కనూ కాపాడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శిదే అంటూ సూచించారు. మరొక సారి ఇలా జరిగితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఎంపీడీవో సూర్యకాంత్‌ను ఆదేశించారు. అనంతరం నెమ్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో పాల్గొన్నారు. ఆమె వెంట తహసీల్దార్ ప్రవీణ్, ఎంపీడీవో సుబ్రమణ్యం, గిర్దావార్ సాయిలు, అంజు తదితరులు ఉన్నారు.

ప్రతిపాదనలు పంపించాం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): పంట చేతికొచ్చినా తెల్ల జొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రారంభంకాకపోవడంపై 'దళారులే దిక్కు..!' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మహేశ్ కుమార్ స్పందించారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, ఆదేశాలు అందగానే ఏర్పాటు చేస్తామని తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

ఎంపీవో, సెక్రెటరీకి మెమోలు

గాంధారి(ఎల్లారెడ్డి): జిల్లాలో తాగునీటి సమస్యలపై 'సాక్షి'లో 'గొంతు తడిసేదెలా?' శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. తాగు నీటి సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో గాంధారి ఎంపీవో లక్ష్మీనారాయణ, సోమ్లానాయక్ తండా పంచాయతీ కార్యదర్శి దేవీసింగ్‌కు కలెక్టర్ మెమోలు జారీ చేసినట్లు ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. సోమ్లానాయక్ తండాను అధికారులు సోమవారం సందర్శించి విచారణ చేపట్టారు. పరిస్థితులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికను అందజేశారు.

ఘనంగా విమాన రథోత్సవం

- కొనసాగుతున్న సిద్ద రామేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



సిద్దరామేశ్వర స్వామి విమాన రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

భిక్కనూరు: దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్ద రామేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి ఇందులో భాగంగా మంగళవారం విమాన రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంపై ప్రతిష్టించి ఊరేగించారు. రథంను లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. అంతకు ముందు ఆలయ పీఠాధిపతి సదాశివమహంత్ శ్రీసిద్దగిరి సమాధి వద్దకు వచ్చి అక్కడ రుద్రాకారుడిగా మారి పూజలు నిర్వహించారు. అర్చకులు సిద్దగిరిశర్మ, రామగిరిశర్మ, రాజేశ్వరశర్మ, సిద్దేశ్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి అర్చనలు అభిషేకాలను నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి





నెమ్లిలో విద్యార్థులతో సబ్ కలెక్టర్ కిరణ్మయి, మాల్తుమ్మెద హైస్కూల్‌లో డ్యాన్సులు చేస్తున్న విద్యార్థినులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ)/దోమకొండ: విద్యార్థి దశలోనే విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. నెమ్లి గ్రామంలో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆమె పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. విద్యార్థుల నృత్యాలను చూసి అభినందించారు.

ఆమె వెంట డీఈవో రాజు, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు బాల్‌రాజు, ఎంఈవో చందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు. దోమకొండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా ఎంఈవో విజయ్ కుమార్ హాజరై మాట్లాడారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

బాన్సువాడ రూరల్/లింగంపేట/ఎల్లారెడ్డిరూరల్/నాగిరెడ్డిపేట/సదాశివనగర్/మద్నూర్ : బాన్సువాడ మండలం కోనాపూర్ జెడ్పీహైస్కూల్‌లో, ఎల్లారెడ్డి మండలం కళ్యాణి జెడ్పీ పాఠశాలలో, నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద హైస్కూల్‌లో, సదాశివనగర్ మండలం ధర్మారావ్‌పేట్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం పదోతరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. మద్నూర్‌లోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. లింగంపేట మండలం పొల్కంపేట బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో, ఎల్లారెడ్డి మండలం మల్లయ్యపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి కింది తరగతుల విద్యార్థులకు విద్యా బోధన చేశారు.

మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలి



కామారెడ్డి రూరల్: మానవ అక్రమ రవాణా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని మానవ అభివృద్ధి విభాగం డీపీఎం రమేష్‌బాబు అన్నారు. కామారెడ్డి మండల సమాఖ్య కార్యాలయంలో మానవ అక్రమ రవాణా నిరోధకపై జిల్లాలోని 8 మండలాల ఐకేపీ ఏపీఎంలకు, సీసీలకు మానవ అక్రమ రవాణా అంశంపై మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానవ అక్రమ రవాణా ద్వారా లైంగిక దోపిడి, అవయవ దోపిడి, శ్రామిక దోపిడి, డ్రగ్స్ రవాణా లాంటి అసాంఘిక కార్యకలపాలపై తరుచూ ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, బీఎన్ఎస్ చట్టం, నివారణ చర్యలు చట్టాల పై అవగాహన, సైబర్ ఆధారిత అక్రమ రవాణా లైంగిక అక్రమ రవాణా చట్టాలపై అవగాహన కల్పించారు. శిక్షణ అనంతరం గ్రామాలలోని చిన్న సంఘాల సమావేశం లలో సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో మురళీ కృష్ణ, ఏపీఎంలు ప్రసన్న రాణి, శ్రీనివాస్, గజాబింకర్ శ్రీనివాస్, రాజు, శిరీష, గంగాధర్, మోయిజ్, రామచంద్ర గౌడ్, ఎనిమిది మండలాల సీసీలు, టీవోటీలు రాజేందర్, జగదీష్ కుమార్, శ్రీనివాస్, అన్నపూర్ణ, గీత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ అందజేత

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని పోతంగల్ కలాన్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లిన సైన్స్ ఉపాధ్యాయురాలు వేల్పుల గీత మంగళవారం ప్రింటర్‌ను బహూకరించినట్లు హెచ్‌ఎం రంగారావు తెలిపారు. పాఠశాలలో మంగళవారం ఆమెకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలలో బెంచీల కోసం విరాళం

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం జెడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు ఇనుప బెంచీల కోసం ఆపాఠశాల పూర్వవిద్యార్థులు విరాళాలు అందజేస్తున్నారు. మంగళవారం 2008–09 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పలువురు రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, మన్నె అనిల్, సయ్యద్ మెహరాజ్, వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ సోషల్ వర్క్ దినోత్సవం



సౌత్‌క్యాంపస్‌లో రక్తదానం చేస్తున్న యువకులు

భిక్కనూరు: తెలంగాణ యునివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో ప్రపంచ సోషల్ వర్క్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి.నాగరాణి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సేవ కార్యక్రమాలపై దృష్టిసారించాలన్నారు. సమాజసేవతోనే గుర్తింపు వస్తుందన్నారు. తదుపరి రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుధాకర్‌గౌడ్, వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరీ, వార్డు సంస్థ డైరెక్టర్ మల్లవరపు ప్రసాద్ అధ్యాపకులు యాలాద్రి నర్సయ్య, రమాదేవి, సబిత మోహన్‌బాబు, లలిత, హరిత ఏపీఆర్‌వో సరిత,నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి



మాట్లాడుతున్న వజ్జ నవనీత

కామారెడ్డి టౌన్: విద్యార్థులు, యువత పలు కార్యక్రమాల వేదికలపై మాట్లాడేందుకు ప్రసంగ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని ఇంపాక్ట్ ట్రైనర్, ప్రముఖ మోటివేటర్ వజ్జ నవనీత తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌కే డిగ్రీ, పీజీ కళాశాలలో ఎఫెక్టివ్ పబ్లిక్ స్పీచ్ అంశంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఆత్మవిశ్వాసంతో మాట్లాడే పద్ధతులు, స్వర నిబంధన, శరీర భాష, ప్రేక్షకులను ఆకర్షించే విధానాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డి, ట్రైనర్ నారాపురం రాజు, జేసీఐ ఉపాధ్యక్షుడు మర్రి సదాశివరెడ్డి, ప్రిన్సిపల్ సైదయ్య, దత్తాద్రి, నవీన్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రధాన కాలువలో గల్లంతైన రామగళ్ల దశరథం(38) అనే వ్యక్తి మృతదేహం మంగళవారం సాయంత్రం లభ్యమైంది. మహమ్మద్‌నగర్ మండలం బూర్గుల్ గ్రామానికి చెందిన దశరథం సోమవారం గ్రామ శివారులోని ప్రధాన కాలువలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడి గల్లంతయ్యాడు. అతని ఆచూకీ కోసం అగ్నిమాపక సిబ్బంది ప్రధాన కాలువ నీటిలో గాలించారు. సింగీతం గ్రామ శివారులోని ప్రధాన కాలువ బ్రిడ్జి వద్ద మృతదేహం లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మాచారెడ్డి: జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మాచారెడ్డి మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన బానోత్ పద్మ(43) అంగవైకల్యంతో బాధపడుతోంది. జీవితంపై విరక్తితో ఈ నెల 15న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించింది. కొద్ది సేపటికి విషయాన్ని గమనించిన కుటుంబీకులు సిరిసిల్లా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

రెండు బోరు మోటార్ల చోరీ

మాచారెడ్డి: పాల్వంచ మండల శివారులోని ఇద్దరు రైతుల బోరు మోటార్లను గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి దొంగిలించినట్టు ఎస్సై అనిల్ తెలిపారు. గ్రామానికి చెందిన గాలి బొందయ్య, కొండె శ్రీనివాస్‌లకు చెందిన వ్యవసాయ భూమిలోని బోరు మోటార్లతో పాటు వైర్లను ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

బోధన్ టౌన్: మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు టిప్పర్‌ను పట్టుకున్నట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు. బోధన్ పట్టణంలోని బెల్లాల్ రైల్వేగేట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ టిప్పర్‌ను ఆపి పరిశీలించగా అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్.. ఒకరు మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



తీవ్రగాయాలతో సంజన

భిక్కనూరు: జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రగాయాలైన ఘటన భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామ శివారులో మంగళవారం వేకువజామున చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఈసీఎల్ ప్రాంతానికి చెందిన అనంత్(23), సంజన స్నేహితులు. వీరు సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చి మంగళవారం వేకువజామున తిరిగి హైదరాబాద్‌కు బైక్‌పై వెళ్తుండగా జంగంపల్లి శివారులోని జాతీయ రహదారిపై అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ఘటనలో అనంత్ అక్కడికక్కడే మృతి చెందగా సంజనకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు సంజనను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, అనంత్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కరెంట్ షాక్‌తో..

సదాశివనగర్: షార్ట్ సర్క్యూట్‌తో ఓ యువకుడు మృతి చెందిన ఘటన సదాశివనగర్ మండలం ఉత్తునూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుడిసె సతీశ్(25) మంగళవారం ఉదయం పొలంలో మందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. పిచికారీ కోసం కావాల్సిన నీటిని తెచ్చేందుకు తన వ్యవసాయ బావిలోకి దిగాడు. బావిలో ఉన్న మోటర్ వైర్ తెగి నీటిలో పడిపోయింది. ఈ విషయాన్ని గమనించని సతీశ్ నీటిని తీసుకుంటుండగా కరెంట్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పెళ్లయిన పదమూడు రోజులకే మృత్యు ఒడికి..

- చెరువులో పడి యువకుడి మృతి



సదాశివనగర్: పెళ్లయిన పదమూడు రోజులకే ఓ యువకుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన ఘటన సదాశివనగర్ మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన కడమంచి రాములు(26) ఆరు నెలల క్రితం దుబాయి నుంచి వచ్చాడు. ఈ నెల 6న మెట్‌పల్లికి చెందిన ఓ యువతిని వివాహం చేసుకున్నాడు. గ్రామ సమీపంలోని పాత చెరువులో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన రాములు ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిపోయాడు. రాములకు ఈత రాకపోవడంతోనే నీట మునిగి మృతి చెందాడు. మృతుడి తండ్రి సిద్ధిరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో పడి మహిళ..



పిట్లం: ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ మృతి చెందిన ఘటన పిట్లం మండలం కిష్టాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్నోళ్ల సత్యవ్వ(45) మంగళవారం ఉదయం 10 గంటలకు గ్రామ చెరువులో బట్టలు ఉతికేందుకు వెళ్లింది. ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడిపోవడంతో నీట మునిగి మృతి చెందింది. భర్త బాలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి యువకుడు..



దశరథ్ (ఫైల్)

మద్నూర్: ట్రాక్టర్‌పై నుంచి పడి ఒకరు మృతి చెందిన ఘటన మద్నూర్ మండలం చిన్న ఎక్లార గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఇన్‌చార్జి ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. మద్నూర్ మండలం మేనూర్ గ్రామానికి చెందిన దశరథ్(25) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చిన్న ఎక్లార శివారులో ట్రాక్టర్‌పై మట్టిని తరలిస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. ట్రాక్టర్ వెనుక చక్రాలు అతనిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.